ప్రజాశక్తి
శనివారం 21 సెప్టెంబర్ 2024 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా





మొక్కుబడిగా రుణాల రీషెడ్యూల్

- తొలి రోజు నామమాత్రంగానే దరఖాస్తులు
- అవగాహన కల్పనలో అధికారులు విఫలం

ప్రజాశక్తి - విజయవాడ : వరద ప్రభావిత ప్రాంతాల్లో రుణాల రీషెడ్యూల్, కొత్త రుణాల సేవల కోసం విజయవాడ సబ్ కలెక్టరేట్లో శుక్రవారం ప్రారంభమైన ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రం బోసిపోయింది. అంతగా ప్రచారం లేకపోవడంతో ఈ కేంద్రానికి బాధితులు పెద్దగా రాలేదు. దరఖాస్తులు కూడా నామమాత్రంగానే వచ్చాయి. ఈ కేంద్రానికి తొలి రోజు స్పందన అంతగా కనిపించలేదు. రుణాల రీ షెడ్యూల్‌కు మొత్తం 120 దరఖాస్తులు వచ్చాయి. ఈ వచ్చిన దరాఖాస్తుల్లో కూడా హౌసింగ్, వెహికల్, వ్యక్తిగత రుణాల రీషెడ్యూల్‌కు సంబందించినవే ఉన్నాయని అధికారులు వివరించారు. వ్యక్తిగత రుణాలు, హౌసింగ్, పంట రుణాలు, ఎంఎస్ఎంఇ రుణాలు పొందిన వరద బాధితుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. యూనియన్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరాబ్యాంక్, ఎస్‌బిఐ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సప్తగిరిబ్యాంక్ తదితర 13 బ్యాంక్‌లకు చెందిన ప్రత్యేక కౌంటర్లు ప్రారంభించారు. ఎన్‌టిఆర్ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రియాంక పర్యవేక్షిస్తున్నారు. కానీ వరద ప్రభావిత ప్రాంతాల్లో ఈ కేంద్రం పట్ల అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే చర్చ సాగుతోంది. ఎక్కువ మంది ఇళ్లకు సంబంధించిన క్లయిమ్‌ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వచ్చారు. అయితే ప్రస్తుతం వారికి అవకాశం లేదని ఆయా బ్యాంకర్ల ప్రతినిధుల నుంచి సమాధానం రావడంతో బాధితులు నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. బుడమేరు వరదలో సర్వస్వం కోల్పోయిన న్యూ రాజరాజేశ్వరిపేట (న్యూ ఆర్ఆర్‌పేట)కు చెందిన ఎం.శారద అనే ఉపాధ్యాయురాలు గృహ సురక్ష కింద సుమారు రూ.50 లక్షల వ్యయంతో భవనం నిర్మించుకున్నారు. దెబ్బతిన్న ఇంటికి బీమా క్లయిమ్ చేసుకునేందుకు ఆమె కుటుంబ సభ్యులు వచ్చారు. కానీ ఈ కేంద్రం రుణాల రీ షెడ్యూల్ కోసమేనని, బీమా క్లయిమ్ కోసం కాదని బ్యాంక్ ప్రతినిధుల నుండి సమాధానం రావడంతో నిరాశ చెందారు. జనరల్ ఇన్స్యూరెన్స్ కంపెనీకి వెళ్లి వివరాలు తెలుసుకోవాలని సలహా ఇచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఎంత మేర రుణాలు తీసుకున్నారు, ఏఏ రుణాలు తీసుకున్నారో వివరాలు వెల్లడించడానికి లీడ్ బ్యాంక్ మేనేజర్ నిరాకరించడం గమనార్హం.

615 ఖాతాలకు చెందిన రూ.51.37 కోట్ల రుణాలు రీషెడ్యూల్ : కలెక్టర్

భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజల నుంచి వస్తున్న రీషెడ్యూల్ దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు బ్రాంచ్‌లతోపాటు సబ్ కలెక్టరేట్లోని ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం 615 ఖాతాలకు సంబంధించి రూ.51.37 కోట్ల మేర రుణాలను రీషెడ్యూల్ చేసినట్లు వెల్లడించారు. కొత్త రుణాల దరఖాస్తులను కూడా వేగవంతంగా స్క్రూటినీ చేస్తూ మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్తగా 340 ఖాతాలకు రూ.3.41 కోట్ల మేర రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇందులో 120 ఖాతాలకు రూ.30 లక్షల మేర వినియోగ రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా ఈ ఏర్పాట్లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రం ప్రారంభం

అందుబాటులో 13 బ్యాంకుల కౌంటర్లు

విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యాకింగ్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన కోరారు. శుక్రవారం ప్రారంభమైన బ్యాంకింగ్ సేవల ఫెసిలిటేషన్ కేంద్రాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్, కలెక్టర్ డాక్టర్ సృజన, విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్ పరిశీలించారు. దీనిలో యూబీఐ, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకుల ప్రతినిధులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. రుణాల రీషెడ్యూల్ అవకాశాన్ని పొందడంతో పాటు వినియోగ రుణాలు, కొత్త మూలధన రుణాలు వంటి సేవలు పొందొచ్చని తెలిపారు. చాలా తేలిగ్గా బ్యాంకింగ్ సేవలు పొందేందుకు లీడ్ బ్యాంక్ యూబీఐ భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) ఏజీఎం డి.శ్రీనివాస్, యూబీఐ డిప్యూటీ రీజనల్ హెడ్ ఐఎస్ఎస్ మూర్తి, ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జె.నివాస్, సృజన



22న జనసేనలో చేరుతున్నా

- మాజీ ఎంఎల్ఎ ఉదయభాను
- వైసిపిలో విశ్వసనీయత లేదని వ్యాఖ్య

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : ఈనెల 22న పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరుతున్నట్లు ప్రభుత్వ మాజీ విప్, జగ్గయ్యపేట మాజీ శాసనసభ్యులు, వైసిపి నాయకులు సామినేని ఉదయభాను చెప్పారు. శుక్రవారం స్థానిక శుభమస్తు కల్యాణ మండపంలో ఆయన నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ విలువలు, విశ్వసనీయత లేని వైసిపిలో కొనసాగడం ఇష్టం లేకనే పార్టీకి రాజీనామా చేస్తున్నానని తనకు రాజకీయ భిక్ష పెట్టింది డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు ఎన్నో రకాల సేవలు అందించానని చెప్పారు. రాజశేఖర్ రెడ్డి మరణానంతరం కాంగ్రెస్‌ను వీడి ఆయన కుమారుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్థాపించిన వైసిపిలో చేరానని తెలిపారు. అప్పటినుండి ఆ పార్టీలో కొనసాగుతూ పార్టీని బలోపేతం చేశానని పేర్కొన్నారు. పార్టీలో అత్యంత సీనియర్ అయిన తనకే తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ సమస్యల కోసం ముఖ్యమంత్రిని కలవాలంటే రోజుల తరబడి వేచి చూడాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఉండేదన్నారు. పలు సమస్యల కోసం జగన్‌ను కలవడానికి వెళ్తే ఎన్నో అడ్డుగోడలు ఉండేవని ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ ఎంఎల్ఎ అడుసుమిల్లి మృతి

వార్త మెయిన్‌లో

ముంబయి నటి కేసులో కుక్కల విద్యాసాగర్ అరెస్టు

ప్రజాశక్తి - విజయవాడ : ముంబయి నటి కాదంబరీ జెత్వానీపై కేసు పెట్టిన వ్యవహారంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, వైసిపి నేత కుక్కల విద్యాసాగర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. జెత్వానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. వేరే రాష్ట్రంలో ఉన్న విద్యాసాగర్‌ను సాంకేతిక ఆధారాల సాయంతో శుక్రవారం అరెస్టు చేశారు. ఫోర్జరీ పత్రంతో తనపై తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేయించి ఇబ్బందులకు గురిచేశారని జెత్వానీ ఇటీవల ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో ఐపిఎస్ అధికారులు సీతారామాంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్ని కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఫిర్యాదుపై విచారించిన పోలీసులు... ఈ కేసులో ఎ 1గా ఉన్న కుక్కల విద్యాసాగర్‌ను అరెస్టు చేశారు. తప్పుడు ఆధారాలను సష్టించడం, నేరానికి పాల్పడినట్లు తప్పుడు ఆరోపణలు చేయడం, పత్రాలను ఫోర్జరీ చేయడం, తప్పుడు రికార్డులను తయారు చేయడం తదితర ఆరోపణలపై ఐపీసీలోని 192, 211, 218, 220, 354 (డి), 467, 420, 469, 471 రెడ్ విత్ 120 (బి), ఐటీ చట్టంలోని 66ఏ సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదైన విషయం తెలిసిందే.

ముందస్తు బెయిల్‌కు కాంతిరాణా టాటా పిటిషన్

సినీనటి కాదంబరీ జెత్వానీపై కేసులో సస్పెండైన ఐపిఎస్ అధికారి, ఎన్‌టిఆర్ జిల్లా పూర్వ పోలీసు కమిషనర్ కాంతిరాణా టాటా ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈపిటిషన్‌పై సోమవారం విచారణ జరుపుతామని హైకోర్టు తెలిపింది.

వరద బాధితులకు నష్టపరిహారం పెంచాలి

కలెక్టర్ సృజనకు సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి - విజయవాడ : బుడమేరు, కష్ణా నది వరదలతో నీటి మునిగిన ప్రాంతాల్లో నష్ట పరిహారాన్ని పెంచి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, జిల్లా కమిటీ సభ్యులు పుప్పాల కష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాశీనాథ్ మాట్లాడుతూ వరదల కారణంగా నగరంలో సుమారు 3 లక్షల కుటుంబాలు నష్టపోయాయన్నారు. ఒక్కో ఇంటికి సుమారు లక్ష నుండి రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. ఇళ్లతోపాటు ఇళ్లలోని సామాన్లు, వాహనాలు కూడా పూర్తిగా పాడైపోయాయని తెలిపారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన పరిహారం బాధితులకు ఏమాత్రం సరిపోదన్నారు. కేవలం ఒక్కో ఆటో రిపేరుకే రూ.10 వేల నుండి రూ.60 వేల వరకు ఖర్చవుతుందని పేర్కొన్నారు. వరదల్లో నష్టపోయిన ప్రతి కుటుంబానికి సాయం అందించాలని కోరారు. గ్రౌండ్ ఫ్లోర్లోని వారికి రూ.50 వేలు,

(మిగతా 2లో)



కలెక్టర్ సృజనకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు దోనేపూడి కాశీనాథ్, పి.కృష్ణ తదితరులు



వార్త 2లో

ఆశా వర్కర్లకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎన్.సిహెచ్.శ్రీనివాస్, ఎ.కమల, కె.కళ్యాణ్ తదితరులు

వరద బాధిత ఆశాలకు నిత్యావసరాలు పంపిణీ



మంత్రి సారథిని సత్కరిస్తున్న ఎపిఎంపిఎ నేతలు శ్రీరామ్‌యాదవ్, వెంకట రమణ తదితరులు

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

మంత్రులు సారథి, లోకేష్‌లకు ఎపిఎంపిఎ నేతల వినతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జర్నలిస్టుల సంక్షేమ పథకాలను మరింత మెరుగుదల చేస్తామని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఎపిఎంపిఎ) నేతలు శుక్రవారం మంత్రి సారథిని రాష్ట్ర సచివాలయంలో, మంత్రి లోకేష్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈసందర్భంగా నేతలు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. డిసెంబరు 31 నాటికి మీడియా అక్రిడిటేషన్లు ఇవ్వాలని, జర్నలిస్టుల బీమా సౌకర్యం రూ.10 లక్షల నుండి రూ.20 లక్షలకు పెంచాలని, ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని, జర్నలిజం వత్తిలో 20 ఏళ్లు నిండిన వారికి పలు రాష్ట్రాల్లో అందిస్తున్న విధంగా ప్రతి నెలా రూ.10 వేలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, హెల్త్ కార్డు అప్లోడ్లలో వస్తున్న ఇబ్బందులను తొలగించాలని, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ రాష్ట్రస్థాయిలోనే జీవో ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వీర్ల శ్రీరామ్ యాదవ్, యేమినేని వెంకటరమణ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు విజయ్ బాబు, కళ్యాణపు సూర్య ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన వరద బాధిత ఆశాలకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలో వరద ముంపునకు గురైన ఆశా వర్కర్ల కుటుంబాలకు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యాన దుప్పట్లు, చీరలు, లుంగీలు, టవళ్లు, ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని సిఐటియు అనుబంధ సంఘాలు, రంగాల కార్మికుల ద్వారా, సిఐటియు ద్వారా సేకరించిన విరాళాలతో 200 మంది ఆశా కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. విజయవాడ గవర్నరుపేటలోని శ్రీశ్రీ భవన్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్ శ్రీనివాస్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ విజయవాడలో 15 రోజులపాటు వేలాదిమంది వరద బాధితులు ఆహార ప్యాకెట్లు, భోజనం పంపిణీ చేశామని, నిత్యావసర సరుకులు అందించామని తెలిపారు. వరద బాధితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పూర్తిగా ఆదుకోవాలని కోరారు. ముంపు శాశ్వత నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కోట కళ్యాణ్, ఎం.సోమేశ్వరరావు, సిహెచ్.వెంకటేశ్వరరావు, జ్యోతి, వై.సుబ్బారావు, ఎం.వి.నారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులకు నష్టపరిహారం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

ఫస్ట్ ఫ్లోర్ వారికి రూ.20 వేలు సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. వాహనాలకు, చిరు వ్యాపారులకు, కిరాణా షాపులకు పరిహారాన్ని పెంచాలన్నారు. బాధిత మున్సిపల్ కార్మికులకు వారం నుండి 10 రోజులపాటు జీతంతో కూడిన సెలవులు ఇవ్వాలని కోరారు. కృష్ణానదికి రిటైనింగ్ నిర్మించినా తారాకరామా నగర్, భూపేష్ గుప్తానగర్, రామలింగేశ్వరనగర్ ప్రాంత వాసులు వరద ముంపునకు గురయ్యారని తెలిపారు. నీట మునిగిన ప్రతి కుటుంబానికి మ్యాపింగ్, ఎలైన్‌మెంట్లతో సంబంధం లేకుండా వాస్తవాలను అంచనా వేసి పరిహారం అందించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు టి.చంద్రశేఖర్, ఎన్.నాగేశ్వరరావు, కోటిరెడ్డి, ఆదామ్ పాల్గొన్నారు.

గొప్పలు మాని వరద బాధితులను ఆదుకోండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ : వరదల్లో లక్షలాదిమంది నిండా మునిగితే, వరదపై విజయం సాధించేలా చేశామని కూటమి ప్రభుత్వం చెప్పుకోవటం తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. కష్టాల్లో ఉన్న వరద బాధితులకు, నష్టానికి తగిన విధంగా పూర్తి సహాయం తక్షణమే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితుల పేర్ల నమోదులో లోపాలను సరిదిద్దాలని, నష్టపరిహారం పెంచాలని, బాధితులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. శుక్రవారం 59వ డివిజన్ అజిత్ సింగ్ నగర్ లెనిన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సిపిఎం భోజన కేంద్రాన్ని ఆ పార్టీ నేతలు పరిశీలించారు. వందలాది మందికి భోజనం పంపిణీ చేశారు. స్థానిక ప్రజలను కలుసుకొని వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈసందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తి చేసిన సందర్భంగా వరదపై విజయం సాధించేలా చేశామని గొప్పలు చెప్పుకోవడం తగదన్నారు. ముందస్తు హెచ్చరికలు చేయకపోవడంతో ప్రజలు నిండా మునిగారని, ఏనాడూలేని ఆస్తి నష్టం జరిగి కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారని అన్నారు. 20 రోజుల నుండి బాధితులు అల్లాడుతున్నారని, కానీ ప్రభుత్వ ఆర్థిక సహాయం ఇంతవరకు అందలేదని పేర్కొన్నారు. బాధితులను గుర్తించడంలో లోపాలు జరిగాయని ప్రజలే ఫిర్యాదు చేస్తున్నారని, ఎంతోమంది పేర్లు నమోదు కాలేదని పేర్కొన్నారు. కూటమిలోని బిజెపి... కేంద్రం నుండి నయా పైసా విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కుబడి చర్యలతో సరిపెట్టిందని విమర్శించారు. ఇటువంటి స్థితిలో విజయం సాధించామని చెప్పుకోవటం బాధాకరమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం వరద ముంపు చర్యలను గాలికి వదిలేసిందని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలు చేయటంలోనూ, పునరావాస శిబిరాల ఏర్పాటులోనూ, బాధితుల తరలింపులోనూ పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా కుటుంబానికి ఇచ్చే ఆర్థిక సహాయం రూ.50 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వాహనాలకు ఇచ్చే సహాయం రెట్టింపు చేయాలని, దెబ్బతిన్న వస్తువులకు మరమ్మతులు చేయించాలని కోరారు. చిరు వ్యాపారుల మొదలు చిన్న పరిశ్రమల వరకు అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ నగరపాలక సంస్థలో పాలకపక్షంగా ఉన్న వైసిపి ప్రజాప్రతినిధులు పత్తా లేకుండా పోయారన్నారు. ప్రారంభోత్సవాలు, మొక్కుబడి కార్యక్రమాలకు హాజరవుతున్నారు తప్ప, బాధితులను ఆదుకునే పనిలో లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు బి.రమణరావు, కే దుర్గారావు, టి ప్రవీణ్, పీర్ సాహెబ్, నాగార్జున, సన్యాసిరావు, పున్నారావు, రసూల్, ఫాతిమా, బుజ్జమ్మ పాల్గొన్నారు.



పార్కుల్లో స్వచ్ఛత హి సేవ

సింగల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్‌పై ర్యాలీ

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర స్వచ్ఛత హీ సేవలో భాగంగా ప్రజలను ఎంతగానో ఆహ్లాదపరిచే రాజీవ్‌గాంధీ పార్క్, రివర్ ఫ్రంట్ ప్లాజా, స్క్రాప్ పార్కుల్లో శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఆయా పార్కుల్లో నగర పౌరుల సహకారంతో వాటిని పరిశుభ్రపరిచారు. అంతేకాకుండా సింగిల్ యూస్ ప్లాస్టిక్ బ్యాన్ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించేలా పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, నగర పౌరులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గాంధీజీ మహిళా కళాశాల, బీసెంట్ రోడ్, కష్ణవేణి రోడ్లలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే స్వచ్ఛత హి సేవలో కార్యక్రమంలో ప్రజలు ఆహ్లాదంగా గడిపే ప్రదేశాలలో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, కార్పొరేటర్ ఉమ్మిడి వెంకటేశ్వరావు (చంటి), అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్న వాళి పాల్గొన్నారు.





పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

'మంచి ప్రభుత్వం'లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజల ఆకాంక్షల మేరకు సుపరిపాలన అందిస్తూ సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న మంచి ప్రభుత్వం మీ ముందుందని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన కోరారు. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె రామలింగేశ్వరనగర్‌లో ఇంటింటినీ సందర్శించి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో భాగంగా ప్రభుత్వం అవ్వాతాతలకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలకు పెన్షన్‌ను పెంచి అందిస్తున్నట్లు తెలిపారు. అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించి, రూ. 5కే భోజనం పెట్టి ఆదుకుంటోందన్నారు. ధాన్యం కొనుగోలులో చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించి రూ.1,674 కోట్లు చెల్లించిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేసి భూహక్కులపై ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. మెగా డీఎస్సీ నిర్వహణకు చర్యలు తీసుకుందన్నారు. వరదలకు ఛిన్నాభిన్నమైన విజయవాడ బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా ఉన్నారని తెలిపారు. భవిష్యత్తులో ప్రజల సంక్షేమం, అభివద్ధే ధ్యేయంగా ప్రభుత్వం వినూత్న పథకాలను అమలు చేసుందని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థిక పరిపుష్టిని సాధించాలని కలెక్టర్ సూచించారు.

యుపిఎస్‌సి మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్, సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నుండి యుపిఎస్‌సి మెయిన్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షా కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా పరిశీలించారు. పరీక్షకు 135 మంది అభ్యర్థులకుగాను 128 మంది హాజరయ్యారు.

అన్న క్యాంటీన్ల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం విఎంసి ప్రధాన కార్యాలయంలో అన్న క్యాంటీన్ల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. నగరంలోని 11 అన్న క్యాంటీన్లకు ఉన్న ప్రత్యేక అధికారులతో ఆయన ఈ సమావేశం నిర్వహించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం తగదు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జాతీయ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న చిరు ఉద్యోగు లను రాజకీయ కారణాలు, ఆరోపణలతో తొలగించడం సరికా దని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. కృష్ణాజిల్లాలో పలు గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న చిరు ఉద్యోగులను రాజకీయ ఒత్తిళ్ల సాకుతో అధికారులు అకారణంగా తొలగిస్తున్న పలు అంశాలు తమ సంఘం దష్టికి రావడం తీవ్ర ఆవేదన కలిగిస్తుందన్నారు. తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లలో చాలామంది ఎస్సీ,ఎస్టీ ,బీసీలకు చెందిన పేద వర్గాల వారే ఉన్నారని పేర్కొన్నారు.ఫీల్డ్ అసిస్టెంట్లు లను రాజకీయ కారణాలతో తొలగించడం సమర్థనీయం కాదన్నారు.రాజకీయ కారణాలకు నిరుద్యోగుల చిరు ఉపాధిని దూరం చేయటం న్యాయం కాదన్నారు.ఈ అంశాలను డ్వామా అధికారుల దష్టికి తీసుకు వెళితే తమదేమీ లేదని స్థానిక ఎమ్మెల్యేలు చెబితేనే తొలగిస్తూన్నామంటూ సమాధానం చెపుతున్నారని సురేష్‌బాబు తెలిపారు. ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి అదే గ్రామంలో వేరే ఫీల్డ్ అసిస్టెంట్ ను నియమిం చడంతో స్థానికంగా వ్యక్తుల మధ్య మనస్పర్థలు, రాజకీయ తగా దాలు వచ్చే అవకాశాలు కూడా ఉంటాయ న్నారు. తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్ల అంశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పునరాలోచన చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వరద బాధితులకు చేయూత

ప్రజాశక్తి-గన్నవరం : బుడమేరు వరదలలో సర్వస్వం కోల్పోయిన కుటుంబానికి లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ జంక్షన్ ఆధ్వర్యంలో కమ్మవారి ఐక్య సేవాసమితి ఆంధ్ర ప్రదేశ్ సహకారంతో వంట సామాగ్రి అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ జంక్షన్ అధ్యక్షుడు కళ్లేపల్లి నారాయణరావు, ఏపీయూ డబ్ల్యూజే కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి రాజశేఖర్, కమ్మవారి ఐక్య సేవా సమితి ఆంధ్ర ప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు పరుచూరి రామకష్ణ, లయన్స్ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కినేని శ్రీనివాస పణీంద్ర పాల్గొన్నారు



ర్యాగింగ్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ విభాగం కన్వీనర్ డాక్టర్ ఏ వీరకుమారి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డి ఉమారాణి అధ్యక్షతన ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవనిగడ్డ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి ఓ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో ఎవరు ర్యాగింగ్, ఆన్లైన్ యాప్లు, సైబర్ క్రైమ్ జోలికి వెళ్ళరాదన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా విద్యార్థులు ఎప్పుడైనా ఈ విషయాలపై తమకు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ కు పాల్పడబోమని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు . ఎస్సై శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్ అంకారావు, లెఫ్టినెంట్ డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన కల్పించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : విద్యార్థి దశ నుంచే ప్రతి పిల్లవాడికి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా (వ్యర్థాల నుండి కళాకతులు) అనే అంశంపై జిల్లాలో పనిచేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్ ఉపాధ్యాయులు, మండలానికి ఇద్దరు రిసోర్స్ ఉపాధ్యాయులకు శుక్రవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతి పిల్లవాడికి విద్యార్థి దశనుండే పర్యావరణ పరిరక్షణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించినట్లయితే పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన వారు అవుతారన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాలు ప్రభుత్వ/ ప్రైవేట్ పాఠశాలల 6 నుండి 10 వ తరగతి చదువుచున్న విద్యార్థులకు అక్టోబర్ 2 వ తేదీ నుండి వ్యర్థాల నుండి కళాకతులు చేయుటకై జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తారని, ఈ పోటీల విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25, వేలు,ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, తతీయ బహుమతిగా రూ.15, వేలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా విద్యాశాఖా ధికారి తాహెరా సుల్తానా, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కె.రాములు నాయక్, జిల్లా విద్యాశాఖా సహాయ సంచాలకులు వి. మనోహర్ నాయక్ పాల్గొన్నారు.

బుసక మేట తొలగించేందుకు అనుమతి ఇవ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఘంటసాల : పంటలు పండించే లంక భూముల్లో బుసక మేట తొలగించుకునేందుకు అనుమతి ఇప్పించాలని కోరుతూ ఆదిఆంధ్ర ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ కమిటీ ఎస్సీ సభ్యులు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామంలోని కష్ణానది లంక భూముల్లో సుమారు 490 మంది ఎస్సీ రైతులు అరటి, పసుపు, కంద, మొక్కజొన్న, మినుము, పెసర తదితర పంటలను వేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ఇటీవల కష్ణానదికి వచ్చిన వరదలకు లంక భూముల్లోని పంటలు కొట్టుకుపోవ డంతో పాటు చెత్త చెదారం పేరుకుపోయి బుసక మేట వేసిందన్నారు. మరలా పంటలు పండించాలంటే బుసకను తొలగించుకోవా లన్నారు. అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి బుసక తొలగించేందుకు అనుమతి ఇప్పించడంతో పాటు నష్టపరిహారం కూడా మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్ కు ఆర్జీ సమర్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ జుజ్జువరపు చంటి, కార్యదర్శి జి.వీరరాఘవులు. వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్ర బాబు, కె.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం కెవిఆర్ ఇండోర్ స్టేడియం లో మూడు రోజులు జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కె.వి.ఆర్ స్పోర్ట్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కెవి. రమణ అధ్యక్షత వహించారు. యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా స్థాయిలో మూడు రోజులపాటు పోటీలు నిర్వహించడంతో పాటు గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి వారిలో టాలెంటును బయటకు తీయడం క్రీడా స్ఫూర్తి కలిగిన వారికే సాధ్యమన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకునే శక్తి క్రీడాకారులకే ఉందన్నారు. రాజకీయ చైతన్యవంతం కలిగిన గన్నవరం లో మూడుసార్లు పుచ్చలపల్లి సుందరయ్యను గెలిపించిన ఘనత ప్రజలదే అన్నారు. పోటీల నిర్వహకులు కిషోర్ మాట్లాడుతూ 9 సంవత్సరాలుగా పోటీలు నిర్వహిస్తున్నామని, గ్రామీణ క్రీడాకారులు దాగివున్న క్రీడా స్ఫూర్తిని వెలికి తీసి వారికి మంచి భవిష్యత్తు కలిగేలా చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కెవిఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కె.వి.ఆర్ కిషోర్, ప్రముఖులు పొట్లూరి బసవరావు, జాస్తి వెంకటేశ్వరరావు, లాయర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు. జగదేశ్వర రావు అనుసంధాన కర్తగా వ్యవహరించారు.



పోటీలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు

కానిస్టేబుల్ సస్పెన్షన్

ప్రజాశక్తి-ఉంగుటూరు : పెట్రోల్ బంకులో పనిచేసే మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యవహారంలో అత్కూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ పఠాన్ నాగులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. నిందితుడు హైవే పక్కన నయారా పెట్రోల్ బంక్ లోకి వెళ్లి రెండొందల ఇరవై రూపాయల పెట్రోల్ కొట్టించుకున్నాడు. డబ్బుల అడిగిన మహిళా హెల్పర్ ను బూతులు తిట్టి, డబ్బులు ఇవ్వను, ఏం చేసుకుంటావో చేసుకో అని వెళ్లి పోబోతుండగా సదరు మహిళ బైక్ కి అడ్డుగా నిల్చొని డబ్బులు డిమాండ్ చేసింది. కోపగించుకున్న కానిస్టేబుల్ ఆమెపై చేయి చేసుకొని, బూతులు తిట్టి బైక్ వేసుకొని వెళ్ళిపోయాడు. దాంతో ఆమె అత్కురు పోలీస్ స్టేషన్ లో రిపోర్ట్ ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటన పై ప్రాథమిక విచారణ జరిపిన అనంతరం సదరు కానిస్టేబుల్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్. పీ గంగాధర్ ఉత్తర్వులు జారీ చేసారని ఎస్సై తెలిపారు.

బస్సు అద్దాలు ధ్వంసం, వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కంకిపాడు : మద్యం మత్తులో ఆర్‌టిసి బస్సును అడ్డగించి బస్సు అద్దాలు పగులగొట్టిన కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు కంకిపాడు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం సాయంత్రం కంకిపాడు మండలం కోమడిగుంట లాకులు వద్ద గుడివాడ నుండి విజయవాడ వెళ్తున్న ఆర్‌టిసి బస్సును జగన్నాథపురం గ్రామానికి చెందిన వడ్డీ క్రాంతి రఘురాం మద్యం మత్తులో అడ్డగించి డ్రైవర్ ను దుర్భాషలాడి బస్సు ముందు అద్ధం పగలగొట్టాడు. బస్సు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రఘురాంపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వరిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన

ప్రజాశక్తి-ఘంటసాల : మండల పరిధిలోని యండకు దురు రైతు సేవా కేంద్రంలో రైతులకు వరి పంటలో సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం జిల్లా వనరుల కేంద్రం డిడిఏ జ్యోతిర్మయి మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటలో కాండం తొలుచు పురుగు ఉదతి గమనించామన్నారు. దీని నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరాంత్రనిల్ ప్రోల్ 0.3 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి మొక్క మొత్తం తడిచేలా పిచికారి చేస కోవాలన్నారు. ఘంటసాల కషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.రేవతి మాట్లాడుతూ వాతావరణంలో పగటి ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు కాండం తొలుచు పురుగు ఉధతి ఎక్కువగా ఉంటుందన్నారు. నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరింత్రనిల్ ప్రోల్ 0.3 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి మొక్క కాండం వరకు తడిచేలా పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొవ్వ ఏడిఏ ఎస్.శ్యామల, కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి కె.మురళీకష్ణ, వ్యవసాయ అధికారిణి బి.పద్మజ, విఏఏ వి.నాగబాబు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయశాఖాధికారులు

విద్యార్థులకు కిట్లు అందజేత

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : వరద ప్రభావిత ప్రాంత విద్యార్థులకు ఎస్‌కెటి కిట్లను అందజేస్తున్నట్లు ఎంఈఓ బి.సురేష్ తెలిపారు. పాముల లంక, కాళింగ దిబ్బలంక,పొట్ట దిబ్బలంక, తుమ్మలపచ్చికలంకలోని విద్యార్థుల పుస్తకాలు, బ్యాగులు సర్వం నీటికి తడిసిపోవడం వలన ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మళ్లీ ఆ గ్రామాలలో విద్యార్థులకు అవసరమైన కిట్స్‌ను అందిస్తున్నామని తెలిపారు. యూనిఫారం, బాగ్స్,బెల్టులు, నోటు పుస్తకాలు, డిక్షనరీలను 166 మంది విద్యార్థులకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో శ్రీ గణపతి మహోత్సవంలో భాగంగా శ్రీలక్ష్మి మోటార్ బైక్ మెకానిక్ వర్కర్స్ ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చుక్క ఉపేంద్ర, బైక్ మెకానిక్స్ పాల్గొన్నారు.

ఆసక్తికరంగా ఏరోస్పేస్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-మైలవరం: స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోలి శుక్రవారం ఏరోస్పేస్ విభాగం ఆధ్వర్యంలో అంతరిక్ష మహాయాత్ర కు సంబంధించిన ఎగ్జిబిషన్ ను కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో రూపొందించి అభివద్ధి పరిచిన వివిధ ప్రయోగ వాహనాలు, ఉపగ్రహ నమూనాలతో కూడిన సంచార వాహనమును విద్యార్థులు సందర్శనార్థం ఏర్పాటు చేశారు. ఈ సంచార వాహనాన్ని భారతీయ విజ్ఞానమండలి, భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి రమేష్ రెడ్డి, ఎరోస్పేస్ విభాగాధిపతి లోవరాజు పాల్గొన్నారు.



తిరుపతి లడ్డూను అపవిత్రం చేయడం దారుణం

ప్రజాశక్తి-భవానీపురం: హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా పవిత్రమైన తిరుపతి లడ్డును గత వైసీపీ ప్రభుత్వం అపవిత్రం చేయటం దుర్మార్గమైన చర్య అని జనసేన 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష తిరుపలి సురేష్ తెలిపారు. శుక్రవారం 42వ డివిజన్ జనసేన పార్టీ ఆధ్వర్యంలో భవానీపురం శివాలయం సెంటర్‌లో బ్యానర్ చేతబట్టి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం శివాలయం సెంటర్‌లో మాజీ సిఎం జగన్‌మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను తగులబెట్టి నిరసన తెలిపారు.



పశుసంవర్ధక శాఖ డీడీగా మోసెస్ వెస్లీ



ప్రజాశక్తి-నందిగామ: నందిగామ డివిజనల్ పశు సంవర్ధక శాఖ డివిజనల్ డైరెక్టర్‌గా డాక్టర్.జి. మోసెస్ వెస్లి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందిగామ పశుసంవర్ధక శాఖ డివిజనల్ పరిధిలో పశువులకు సంపూర్ణ ఆరోగ్యం కోసం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

నూతన బస్సు ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్య పేట - విజయవాడ ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను శుక్రవారం స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైనేని రాధాకష్ణ, గట్టిడి దుర్గాప్రసాద్, కళ్యాణం కృష్ణారావు, కన్నెబోయిన రామలక్ష్మి, నకిరకంటి వెంకట్, ఇర్రి నరసింహారావు, సంగెపు బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: డాక్టర్ కే ఎల్ రావు కషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఎన్టీఆర్ జిల్లాలో విస్తతంగా క్షేత్రస్థాయి సందర్శనలు చేపట్టారు. దీనిలో భాగంగా ముందుగా వేసిన వరి పొలాలలో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రస్తుతం తెల్ల రెక్కల పురుగు ఉదృతి అధికంగా గమనించడం జరిగింది. దీని తర్వాత సుడిదోమ ఉధతి అధికమవుతుంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు యాజమాన్య పద్ధతులను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు

ప్రజాశక్తి-తిరువూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించినట్లు తిరువూరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రేష్మా బేగం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే బాలికలకు ప్రతి గురువారం ఐరన్ మాత్రలు పంపిణీ (డబ్ల్యూఐఎఫ్ఎస్) కార్యక్రమంలో భాగంగా 10 నుంచి 19 సంవత్సరాల లోపు బాలికల్లో రక్తహీనతను గుర్తిం చి, వారికి ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేయడానికి రక్త నమోనాలు సేకరించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా బాలికల ఎత్తు, బరు వులను కూడా నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం తిరువూరు ప్రభు త్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ, ఎస్‌కే ఆషాభి పాల్గొన్నారు.

తూనికుంట్ల శ్రీనివాస్‌కు సత్కారం



తూనికుంట్ల శ్రీనివాసును సత్కరిస్తున్న యాజమాన్యం

ప్రజాశక్తి-వన్‌టౌన్: విద్యారంగ వికాసానికి కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు విశేష సేవలందిస్తున్నారని వాసవి విజయవాడ సంస్థ అధ్యక్షులు చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసుకు విద్యారంగంలో అందించిన సేవలకు అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ సెంట్రల్ అమెరికా గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా తూనికుంట్ల శ్రీనివాసుకు ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ హాల్‌లో అభినందన సత్కార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ వంద సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన హిందూహైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల వికాసానికి తూనికుంట్ల శ్రీనివాసు విశేషమైన సేవలందిస్తున్నారన్నారు. ప్రధానంగా కేబీఎన్ కళాశాల అభ్యున్నతిలో ఆయన పాత్ర విశేషంగా ఉందన్నారు. అలాగే ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ఛైర్మన్‌గా, గొల్లపూడి అయ్యప్పస్వామి దేవస్థానం, వాసవి విజయవాడ, అర్బన్ ఆర్యవైశ్య సంఘం, చైతన్య తపోవన్ వంటి అనేక సంస్థలకు ట్రస్టీగా వివిధ హోదాల్లో సేవలందించారన్నారు. అదేవిధంగా పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల స్థాపనలోనూ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. వాసవి సంస్థల కమిటీల ప్రముఖులు వేముల హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ తూనికుంట్ల శ్రీనివాసు అదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మాజేటి రామచంద్రరావు కోశాధికారి నాగండ్ల శ్రీనివాసరావు, కన్వీనర్లు జల్లూరి నాగశ్రీనివాసరావు, వెంకటపుల్లారావు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వరద వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని క్యాటరర్స్ అసోసియేషన్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు వరదరాజులు అన్నారు. బాధితులను ఆదుకునేందుకు ఫెడరేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ కేటరింగ్ అసోసియేషన్, తెలంగాణ కేటరర్ అసోసియేషన్, అల్ ఇండియా కేటరర్ అసోసియేషన్ ముందుకు వచ్చాయి. పాయకపురం కండ్రిక లగడపాటి కమ్యూనిటీ హాల్లో సుమారు వెయ్యి కుటుంబాలకు నెల రోజులకు సరిపడే నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు వరదరాజులు, ఉపాధ్యక్షులు సుధ యలమంచిలి తిలక్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు వరద బాధితులను ఆదుకోవడంలో చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జాస్తీ ఉమామహేశ్వరరావు, తల్లం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు తిరువూరులో ఏచూరి సంతాప సభ

ప్రజాశక్తి-తిరువూరు: సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్ తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు ప్రధాన వక్తగా హాజరవుతున్నారని చెప్పారు. సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వామపక్ష భావాలు ఉన్న ప్రతిఒక్కరు ఈ సభకు హాజరుకావాలని కోరారు.

అవయవదానం, కేన్సర్‌పై అవగాహన


మాట్లాడుతున్న నివృత్తరావు

ప్రజాశక్తి-మైలవరం: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నట్లు అవుతుందని లైన్స్ క్లబ్ పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ లయన్ ఎస్‌పిఎన్ నివృత్తరావు అన్నారు. లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం, పైసల బాబు విజయవాడ జూబ్లీ హరిత, వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం, మొక్కల పంపిణీ, అవయవదానం, కేన్సర్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి అతి తక్కువ ధరకు అవసరమైన వారికి అందజేస్తున్నామన్నారు. రిటైర్డ్ పోలీస్ డిసిపి హరికష్ణ మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ జోన్ చైర్ పర్సన్ జాస్తి వెంకటేశ్వరరావు, విజయవాడ జూబ్లీ, మైలవరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు బెల్లంకొండ శ్రీనివాస్ ప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధా వెంకన్నతో ఎంపి కలిశెట్టి భేటీ

ప్రజాశక్తి-వన్‌టౌన్: టిడిపి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి బుద్దా వెంకన్న నివాసానికి శుక్రవారం వచ్చిన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆయనతో భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు.ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతు బుద్దా వెంకన్న టీడీపీ కోసం ఎంతో పని చేశారని, ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జిగా టీడీపీని బలోపేతం చేశారని అన్నారు.పని చేసే నాయకులను గుర్తించి చాలా ప్రోత్సహించారని, అనేక సందర్భాల్లో నాకు కూడా అండగా నిలిచి, అనేక సూచనలు చేశారని చెప్పారు. అమ్మవారి దర్శనానికి ఈరోజు విజయవాడ వచ్చానని, బుద్దా వెంకన్న ను ఇక్కడ కలవడం ఆనందంగా ఉందన్నారు. గతంలో నోళ్ల పారేసుకున్న వైసీపీ నాయకులపై సవాళ్లు విసిరి దమ్ముగా వెళ్లిన నేత బుద్దా వెంకన్న అని,తప్పకుండా ఆయన సేవలను అధినేత ఉపయోగించుకుంటారని చెప్పారు.

శ్రీశ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-విస్సన్నపేట: విస్సన్నపేటలో శ్రీ శ్రీనివాస విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ వేడుకలకు ప్రముఖ తెలుగు అధ్యాపకులు ముంగా జయరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ యం పూర్ణచంద్రరెడ్డి మాట్లాడుతూ మా విద్యాసంస్థ పదోతరగతి, ఇంటర్, డిగ్రీ లలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఉందని తెలిపారు. అంతేకాకుండా ఇక్కడ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం ద్వారా ఇది సాధ్యం అయిందనీ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించి, నగధు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేతలు రాజేశ్వరరెడ్డి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్మీ వింగ్‌కు 35 మంది ఎంపిక

ప్రజాశక్తి-మైలవరం: స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఆర్మీ వింగ్ సెలక్షన్స్‌లో 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలంధర్ సింగ్ మాట్లాడుతూ ఎన్సిసి విభాగం ద్వారా రక్షణ దళంలో దేశ సరిహద్దులలో పురుషులతోపాటు స్త్రీలకు కూడా మంచి అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్సిసి ద్వారా మంచి క్రమశిక్షణ నిబద్ధత, నడత అలవాడతాయని ఎన్సిసి విభాగంలోకి ప్రతి ఒక్కరూ చేరడానికి ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు, ఆర్మీ ఆఫీసర్ సురేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: అంతర్జాతీకరణలో భాగంగా మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు విరివిగా ఉపాధి అవకాశాలను పొందటానికి పాఠ్యాంశాలే కాకుండా బహుముఖ సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సాంకేతిక శిక్షకులు కోడ్ నెక్స సిఇఒ పవన్ తెలిపారు. స్థానిక జేఆర్‌సి విశ్వ భారతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి మార్గాలను చూపే శిక్షణ కార్యక్రమాన్ని జేఆర్‌సి కళాశాల చైర్మన్ రంగాపురం నరసింహారావు ప్రారంభించారు. జగ్గయ్యపేటలో మొట్టమొదటిసారిగా విశ్వ భారతి డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు నేటి కంప్యూటర్ యుగంలోని నూతన నైపుణ్యాల పట్ల మరియు ఉపాధి మార్గాలను చూపించే శిక్షణను ప్రారంభించడం ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని కళాశాల ప్రతినిధులు రంగాపురం నరసింహారావు, పెనుగొండ వెంకట రాజీవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, వైస్-ప్రిన్సిపల్ కే.ఎన్ రమేష్, జె తిరుపతిరావు, వి.వి.ఎల్ నారాయణరావు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో రోడ్డు పనులు ప్రారంభించాలి : సిపిఎం


రోడ్డు నిర్మించాలని ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఎ.కొండూరు: మండలంలోని రామచంద్రపురం గ్రామంలో విజయవాడ జగదలపూర్ జాతీయ రహదారి 30 రహదారి నిర్మాణ పనులు గత కొన్ని సంవత్సరాలుగా ఆగిపోయాయని, పనులు వెంటనే ప్రారంభించాలని సిపిఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు పి.ఆనందరావు డిమాండ్ చేశారు. శుక్రవారం రామచంద్రాపురంలో హైవే రోడ్డు పనులు చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైవే రోడ్డు నిర్మాణం చేయకపోవడం వల్ల పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనేకసార్లు ప్రమాదాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం రోడ్డు నిర్మాణం వల్ల స్థలాలు ఇల్లు కోల్పోయిన బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.అమ్మిరెడ్డి పి.వెంకటేశ్వరరావు, టి.లక్ష్మయ్య, ముత్తయ్య, ఎం.ఆదినారాయణ పాల్గొన్నారు.

జిఓ 85ను రద్దు చేసే వరకు ఆందోళన

- రాష్ట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల సంఘం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 85ను రద్దు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల సంఘం స్పష్టం చేసింది. ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 85 ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల సమస్యలను పరిష్క రించకుండా ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రదర్శించడం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్, పీజీ కౌన్సిలింగ్ లో గతంలో 30 శాతం మార్కులు వేసే విధానం ఉండేదని, జీవో నెంబర్ 85 తో 15 శాతానికి పరిమిత మౌతుందన్నారు . వెంటనే ఈ జీవోను రద్దుచేసి గతంలో లాగానే పీజీ కౌన్సిలింగ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఆరేళ్ళు సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి డిప్యూటీ సివిల్ సర్జనులుగా, 12 ఏళ్ల పూర్తి చేసుకున్న వారికి సివిల్ సర్జనులుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం కల్పించేందుకు 104 సర్వీస్ ద్వారా వైద్యం అందించడం జరుగుతుందని అక్కడ పనిచేసేటువంటి వైద్యులకు అలవెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్చలు పేరుతో కాలయాపన చేయకుండా సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు తాము శాంతి యుతంగా ఆందోళన చేస్తూ ఉంటామన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతా బాయికి వినతి పత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమం లో వైద్యులు అరుణ్ కుమార్,దీప్తి,చరణ్ , అల్తాఫ్,పలువురు వైద్యులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు



ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థినీలు

గురుకుల పాఠశాలలో సంచార ప్రదర్శన

ప్రజాశక్తి-చల్లపల్లి : గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్, మినిస్టర్ ఆఫ్ కల్చర్ సంయుక్తంగా ఆధ్వర్యంలో జన వేదిక పర్యవేక్షణలో నిర్వహిస్తున్న సంచార ప్రదర్శనను విద్యార్థులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. శుక్రవారం స్థానిక గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన సంచార ప్రదర్శన విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంచేందుకు దోహద పడుతుందని విద్యార్థులు తెలిపారు. జెవివి ప్రతినిధులు, నరేంద్ర రాజా, విష్ణు తల్లిదండ్రుల నుంచి వచ్చే లక్షణాలు డీఎన్ఏ నమూనా తయారు చేసి విద్యార్థులకు చూపించారు. వంశపారం పర్యంగా వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. మేనరికపు పెళ్లిళ్ల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. శరీరంలో రక్త కణాలు తగ్గితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. జెన్ టిక్ వ్యాధుల నివారణ పై విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు.



నిత్యావసరాలు అందిస్తున్న నాయకులు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : చదువుతోపాటు సమాజ సేవలో కూడా ఉపాధ్యాయులు ముందు ఉంటారని యుటిఎఫ్ నాయకులు నిరూపించారు. వరదల కారణంగా సర్వం కోల్పోయిన పాములలంక గ్రామంలోని పాఠశాలలో చదివే విద్యార్థుల కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందించారు. శుక్రవారం యుపిఎఫ్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎంపీపీ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు 26 మందికి నిత్యావసర సరుకులు కిట్లు అందించారు. గతంలో కూడా యుటిఎఫ్ ఆధ్వర్యంలో కాళింగదిబ్బ, పొట్టిదిబ్బ లంక గ్రామాల్లోని కుటుంబాలకు కూడా నిత్యావసర సరుకుల కిట్లను అందించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ. మనోహర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, ఎంఈఓ బి. సురేష్, జిల్లా కార్యదర్శులు సిహెచ్. రాజా శ్రీధర్, అబ్దుల్ హబీబ్,ఉయ్యూరు మండల ప్రధాన కార్యదర్శి పివి రమణ, తోట్లవల్లూరు మండల యూటీఎఫ్ అధ్యక్షురాలు సిహెచ్. మైథిలి, ప్రధాన కార్యదర్శి ఎం. విజయశ్రీ, కార్యకర్తలు బి.హేమకుమారి, నాగబాబు, విష్ణువర్ధన్, బాలాజీ తదితరుల చేతుల మీదుగా సరుకుల కిట్లను అందజేశారు.

ఉద్యోగాలకు 24 మంది ఎంపిక

ప్రజాశక్తి - గుడివాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డిఆర్డిఎ, సీడాప్ ప్రభుత్వ కళాశాల, గుడివాడ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 24 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, గుడివాడ ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. గౌరీమణి సంయుక్తంగా తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గుడివాడలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పన శాఖ వొకేషనల్ అధికారి బ్రహ్మం మాట్లాడుతూ మొత్తంగా 236 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారిలో 24 ఎంపిక కాగా మిగిలిన వారిలో 113 మంది షార్ట్‌లిస్ట్ అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. గౌరీమణి, కళాశాల టిపిఓ జయరాం, వేణు, కళాశాల సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు



వెంకటేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మామిళ్లపల్లి మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-పమిడిముక్కల : మండలంలోని మామిళ్ళపల్లి గ్రామ సర్పంచ్ ఆముదాలపల్లి సుబ్రహ్మణ్యం తండ్రి ఆముదాలపల్లి వెంకటేశ్వరరావు (70) శుక్రవారం మృతిచెందారు. వెంకటేశ్వ రరావు మృతదేహాన్ని మండల ఉపాధ్యక్షులు యలమంచిలి మహేష్, గంజల సీతారామయ్య, ఎంపిటిసి వంశీ పెనుముచ్చ రమేష్, వేల్పూరు మాజీ సర్పంచ్ బోసు బాబు, వైయస్సార్ పార్టీ నాయకులు బొల్లా రాంబాబు, ఆగినపర్రు గ్రామ సర్పంచ్ కోటా మణిరాజ్, మండల తెలుగుదేశం నాయకులు ఆముదాలపల్లి గోపాలకృష్ణ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా మామిడిపల్లి మాజీ సర్పంచ్‌గా వెంకటేశ్వరరావు చేసిన కృషిని పలువురు కొనియాడారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆవరణలో రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్ బాబు, కళాశాల ప్రధాన ఆచార్యులు ఆచార్య ఎన్ ఉష మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం చాలా అవసరం అని వారు ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో బయో టెక్నాలజీ విభాగం అధిపతి డా. సుశీల, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ స్వరూపా, డాక్టర్ రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్వచ్ఛత హి సేవ కార్యక్రమం లో భాగంగా మండలంలోని డోకిపర్రు గ్రామం లో సర్పంచ్ జ్యోతి శుక్రవారంమొక్కలు నాటారు కార్యక్రమాన్ని ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మొవ్వ : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మొవ్వ గ్రామ పంచాయతీ వద్ద మొక్కలు నాటారు. సర్పంచ్ పూర్ణచంద్రరావు మొక్కల వలన కలిగే ఉపయోగాలను వివరించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.వి సోమేశ్వరరావు సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు,



కెయులో మొక్కలు నాటుతున్న దృశ్యం



క్యాంపులో సాధించిన సర్టిఫికెట్లతో ఎన్‌సిసి క్యాడెట్లు

ఎన్‌సిసి క్యాడెట్ల ప్రతిభ

ప్రజాశక్తి-ఉయ్యూరు : సికింద్రాబాద్‌లో ఈనెల 9 నుంచి 18వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి అటాచ్మెంట్ ట్రైనింగ్ క్యాంపులో ఏజిఅండ్ఎస్ఎస్ కళాశాల ఎన్‌సిసి క్యాడెట్లు విశేష ప్రతిభ కనపరచి సర్టిఫికెట్లు సాధించారు. ఈసందర్భంగా కళాశాల ఆవరణలో శుక్రవా రం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం శివనాథ్, స్పెషల్ ఆఫీసర్ సత్యనారా యణ, ఎన్‌సిసి కేర్ టేకర్ ఎండి నూర్ విద్యార్థులను అభినందించారు.

విద్యాకుటుంబం సేవలు స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అవనిగడ్డ : వరద బాధితులకు అండగా నిలిచిన నియోజకవర్గ విద్యా కుటుంబం సహాయం ఒక మోడల్ ప్రాజెక్టుగా నిలిచిందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని దక్షిణ చిరుగోలంకలో నియోజకవర్గ విద్య కుటుంబ ఆధ్వర్యంలో 460 మంది వరద బాధిత కుటుంబాలకు కుక్కర్లు వంట సామాగ్రి సహాయంగా అందించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు, డిఇఓ తాహెరా సుల్తానా, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అతిథులుగా విచ్చేసి పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులు కలసి దాదాపు 30 లక్షల రూపాయలు సమీకరించి నిర్వహి స్తున్న ఈ సేవా కార్యక్రమం స్ఫూర్తిదా యక మన్నారు. వరద నుంచి బయట పడిన బాధితుల కుటుంబాల వారు తిరిగి తమ సాధారణ జీవన స్థితికి చేరుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి కనకారావు, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు జివిఎస్ పెరుమాళ్ళు, ఏపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి సాంబ శివరావు, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు మేడ బాబ్జి తెలుగునాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు కైతేపల్లి దాస్, ఎంఈఓ లు టీపీఎం రాందాసు, జీఎన్ని గోపాల్ ,అన్నపురెడ్డి పిచ్చయ్య వి శ్రీనివాసరావు, సనక నాగమణి ఈశ్వరరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.



వంట పాత్రలు అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎంఎల్ఎ, డిఇఓ

ముంపు బాధితులకు రూ.25 వేలు పరిహారమివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: బుడమేరు, కృష్ణానది పరివాహక ప్రాంత వరద ముంపు ప్రాంత ప్రజలకు విజయవాడ తరహా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ముంపు ఇబ్రహీంపట్నం ఫెర్రీ ప్రాంత ప్రజలు సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. విజయవాడ ప్రాంత బాధితులకు రూ. 25 వేలు ఇచ్చి ఈ ప్రాంతంలో ముంపు ప్రజలకు రూ.10 వేలు ఇవ్వడం సరికాదని సిపిఎం నేత మహేష్ అన్నారు. ఈ ప్రాంత ప్రజలు వరద వల్ల సర్వస్వం కోల్పోయారని, వారికి కూడా సరైనా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరద వల్ల ప్రజలు నష్టపోయి కట్టుబట్టలతో రోడ్డుపైనే ఉంటే నిబంధనల పేరుతో పరిహారం తగ్గించడం ఎంత వరకు న్యాయమని మహేష్ ప్రశ్నించారు. కొండపల్లి మున్సిపాలిటీలో బుడమేరు వల్ల శాంతి నగర్ ప్రాంత ప్రజలు పూర్తిగా నీటి ముంపుకు గురై సర్వం కోల్పోయారని పేర్కొన్నారు. కృష్ణానది వరద వల్ల జగనన్న కాలనీ, ఫెర్రీ, దుర్గ కాలనీ, ఆర్‌టిసి కాలనీల ప్రజలు ముంపు వల్ల తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు విఠల్ రావు, బి.రామసీతా, వరద ముంపు ప్రజలు పాల్గొన్నారు.



ఫెర్రీలో ధర్నా చేస్తున్న వరద బాధితులు, సిపిఎం నాయకులు

మణిపాల్‌కు ఎన్‌ఎబిహెచ్ డిజిటల్ హెల్త్ అక్రిడిటేషన్

ప్రజాశక్తి-తాడేపల్లి

ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మణిపాల్ హాస్పిటల్‌కు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఎన్‌ఏబీహెచ్), క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) ద్వారా ప్రతిష్టాత్మక ఎన్‌ఏబీహెచ్ డిజిటల్ హెల్త్ అక్రిడిటేషన్ (డీహెచ్‌ఏ) గోల్డ్ లెవెల్ లభించింది. ఈ విశేషమైన విజయంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈ గౌరవాన్ని అందుకున్న మొదటి ఏకైక ఆసుపత్రిగా మణిపాల్ ఆసుపత్రి నిలిచింది. హాస్పిటల్స్ (విజయవాడ) నిలిచింది. ఈ కొత్త ప్రమాణం ప్రకారం గుర్తింపు పొందిన భారతదేశంలోని మొదటి వంద ఆసుపత్రులలో ఒకటిగా నిలిచింది. మణిపాల్ ఆసుపత్రికి చెందిన ముఖ్య ప్రతినిధులు, క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉత్తమ్ శర్మ, నర్సింగ్



సూపరింటెండెంట్ వసంత, ఐటీ లీడ్ శ్రీ జహీద్ హుస్సేన్ సహా పలువురు ఈ అక్రిడిటేషన్‌ను స్వీకరించారు. ఈ సందర్భంగా క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ ఈ డిజిటల్ హెల్త్ అక్రిడిటేషన్ అధునాతన డిజిటల్ సిస్టమ్‌లను ఉపయోగించడం ద్వారా సమాజానికి సకాలంలో, సురక్షితమైన, అధిక-నాణ్యతతో కూడిన సంరక్షణను అందించడానికి మణిపాల్‌కు గల నిబద్ధతను సూచిస్తుందన్నారు. రోగి సంరక్షణ డేటా ఇప్పుడు పూర్తిగా డిజిటల్‌గా రికార్డ్ చేయబడి అందుబాటులో ఉందన్నారు. వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందితో సహా ఆరోగ్య సంరక్షణ నిపుణులు ఏ సమ యంలోనైనా రోగి సమాచారాన్ని తక్షణమే యాక్సెస్ చేయడానికి వీలు కల్పిస్తుందన్నారు. డిజిటల్ హెల్త్ రికార్డ్‌ల నిర్వహణ వల్ల బీమా క్లెయిమ్‌ల వంటి ప్రక్రియలను వేగంగా ట్రాక్ చేయగలమన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

ప్రజాశక్తి-గంపలగూడెం

వేగంగా వస్తు ట్రాక్టర్‌ను కారు ఢీకొనడంతో గాయాల పాలైన సంఘటన గంపలగూడెం టౌన్ పరిధిలో ఉన్న ఎన్టీఆర్ కాలనీ (ఎన్ఎస్పి కెనాల్) సమీపన బుధవారం రాత్రి జరిగింది. గంపలగూడెం నుండి ట్రాక్టర్ చింతలపాడు పోతుండగా తిరువూరు నుండి ఎదురుగా వస్తున్న కారు ఢీకొననడంతో చింతలపాడుకు చెందిన కాలసాని శివరామకృష్ణతో పాటు మరొకరు గాయాల పాలైనారు. చికిత్స నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ శ్రీనివాస్ వివరించారు.

దేవినేని రమణ జయంతి

ప్రజాశక్తి-కంచికచర్ల: టిడిపి నాయకుడు, మాజీ మంత్రి దేవినేని



వెంకట రమణ 68వ జయంతి వేడుకలు మండల టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రమణ చిత్ర పటానికి మండల టిడిపి అద్యక్షుడు కోగంటి బాబు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తా రత్నం, ఓంకార్, వేమా వెంకట్రావు, కిషోర్, దాసరి రాము, తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి వీరయ్యచౌదరి రాజీనామా

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు మాదల వీరయ్యచౌదరి తన పదవికి, వైసిపి సభ్యత్వానికి శుక్రవారం రాజీనామా చేసినారు. ఈ నెల 22వ తేదీన మాజీ శాసనసభ్యులు మాజీ ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుతో పాటు జనసేన పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.

ఆడపిల్లలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: బాల్య వివాహాలను అరికడదాం. ఆడపిల్లను పుట్టనిద్దాం - బ్రతకనిద్దాం - ఎదగనిద్దాం- చదవనిద్దాం అనే అంశాలపై శుక్రవారం క్రాంతి హై స్కూల్ లో స్త్రీ శిశు సంక్షే మ శాఖ మరియు చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో విద్యార్థినుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు ఆడపిల్లలను అన్ని రంగాల్లో ముందుండేలా ప్రోత్సహించాలని వారికి చక్కటి విద్యాబుద్ధులు చెప్పించి వారి కాళ్ళ మీద వాళ్ళు నిలబడిన తర్వాత మాత్రమే వివాహం గురించి ఆలోచించాలని తెలియజేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 20 ఏళ్ల లోపు ఆడపిల్లలకు వివాహం చేయకూడదని మైనర్లకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని తెలియజేశారు. ఆడపిల్లల భవిష్యత్తుకు భరోసా నిచ్చే సుకన్య సమద్ధి యోజన మరియు అనేక రకాల ఇన్సూరెన్స్ పాలసీల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్లు రమాదేవి, మాధవి, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, ఓఎస్ చందన, ప్రిన్సిపల్ అమ్మాజీ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలంలోని మూలపాడు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రెవిన్యూ సిబ్బంది శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ సిబ్బంది సుమారు 3700 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నిల్వలను స్వాధీనం చేసుకున్న తర్వాత మూలపాడులోని 49వ నెంబర్ రేషన్ షాపుకు తరలించారు.

పోషకాహార మహోత్సవాలు

ప్రజాశక్తి-గంపలగూడెం: ఐసిడిఎస్ తిరువూరు ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పౌష్టికాహార వారోత్సవాలు అంగన్వాడీ సెంటర్లలో జరుగుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా, శుక్రవారం ప్రాజెక్టు ఆఫీసర్ జి సత్యవతి పర్యవేక్షించి, పరిశీలించారు.




గ్రామాల్లో ఉన్న గర్భవతులను సమీకరించి, శ్రీమంతాలు చేశారు. గ్రామ అధికార పార్టీ నాయకులు గళ్ళ సంగయ్య ఆధ్వర్యంలో అందించారు.ఈ కార్యక్రమంలో పువ్వులు పండ్లు చేరే జాకెట్టు గాజులు తదితరాలు అందజేశారు. అనంతరం గంపలగూడెం 67వ సెంటర్ నందు పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ కార్యకర్తలతో పాటు సూపర్వైజర్ ముని లక్ష్మి, పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పోషకాహార మహోత్సవంలో భాగంగా శుక్రవారం అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, తల్లులకు యోగ సెషన్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసిడిపిఒ నాగమణి, ఐసిడిఎస్ గ్రేడ్ వన్ సూపర్వైజర్ రజనీ జ్వాల పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వరద బాధితుల కోసం విజ్ఞాన్ విద్యాసంస్థలు కాకాని నగర్, విజ్ఞాన్ నగర్ క్యాంపస్ విద్యార్థులతో విరాళాలు సేకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు బంధుమిత్రుల సహకారంతో వసూలు అయిన రూ.1.70 లోలను ముఖ్యమంత్రి సహాయనిధికి శుక్రవారం ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఏపీపీఎస్ఎ డెమోక్రటిక్ జగ్గయ్యపేట డివిజన్ అధ్యక్షులు షేక్ కాలేష ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి అభినందనలు తెలిపారు.


‘ఇది మంచి ప్రభుత్వం’ ప్రారంభం


జగ్గయ్యపేటలో...

ప్రజాశక్తి-కంచికచర్ల: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి ఎన్‌డిఎ కూటమి లక్ష్యమని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్ల మండల పరిధిలోని బత్తినపాడు గ్రామంలో శుక్రవారం ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి వంద రోజులలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, ప్రజాసంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం ప్రతి ఇంటికి స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కోగంటి బాబు, సర్పంచ్ సంతోష్‌రావు పాల్గొన్నారు. **ఎ.కొండూరు:** గ్రామాలను అభివృద్ధి చేసుకోవడంలో రాజకీయాలకు తావు లేదని రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గ్రామాల అభివద్ధి ధ్యేయంగా కృషి చేయాలని తిరువూరు


తిరువూరులో...

నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఇంటింటికి తిరిగి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను అందజేస్తూ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గడ్డి కృష్ణారెడ్డి, చిట్టిబాబు, గోపిరాజు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** మండలంలోని వేదాద్రి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కట్టా వెంకట నరసింహారావు, గ్రామ సర్పంచ్ గుడారు పేరయ్య, మాజీ సర్పంచ్ పసుమర్తి జగజ్జీవన్ రామ్ పాల్గొన్నారు. పట్టణంలోని పదో వార్డులో తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. **మైలవరం:** మండలంలోని తోలుకోడు, వెల్వడం గ్రామాలలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. **విస్సన్నపేట:** విస్సన్నపేట మండలంలో జరిగిన గ్రామ సర్పంచి సాదుపాటి నాగమల్లేశ్వరి, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తెల్లదేవరపల్లి గ్రామంలో సత్యనారాయణ, రాయల వేణు, మాధవ పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** రెడ్డిగూడెంలో ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజయబాబు, ముప్పిడి నాగేశ్వరరెడ్డి, అక్కల రామ్మోహనరావు పాల్గొన్నారు. **వన్‌టౌన్:** ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో కార్పోరేషన్ అధికారులు 42వ డివిజన్ ఇంచార్జి హెలెన్‌తో కలిసి శుక్రవారం ఇంటింటికి వెళ్లి ప్రజలకు పంప్లెట్, స్టిక్కర్స్ అంటించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రామయ్య, నెలకుర్తి వెంకటరావు, సీతా చంద్రశేఖర్, మొవ్వ విజయ పాల్గొన్నారు.


మైలవరంలో...

తిరువూరు: తిరువూరు పట్టణంలోని 10, 11 వార్డులో పర్యటించి కూటమి ప్రభుత్వం వంద రోజు ల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లింగినేని సుధాకర్, పసుపులేటి రవీంద్ర, పరిసే సీతారామలింగేశ్వరరావు పాల్గొన్నారు. డ్వామా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జె. సునీత తిరువూరు పట్టణంలో నగర పంచాయతీ కమిషనర్ లోవరాజుతో కలిసి ఇంటింటికెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. **పెనుగంచిప్రోలు:** మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రతి గ్రామంలో సచివాలయం సిబ్బంది, అధికారులు, దేశం పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.


విస్సన్నపేటలో...

'ఇది మంచి ప్రభుత్వం'పై ప్రచారం


కంకిపాడు మండలంలో...


గుడ్లవల్లేరు మండలంలో...

ప్రజాశక్తి-ఉయ్యూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజుల్లో పలుహామీలు అమలు చేసి ఇది మంచి ప్రభుత్వంగా ప్రజల మన్ననలు పొందుతుందని పలువురు టీడీపీ నాయకులు ఈడే అంజిబాబు, చిరంజీవి పేర్కొన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉయ్యూరు నగరపంచాయతీ పరిధి వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి వార్డుల్లో పర్యటించి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై ఇంటింట ప్రచారం చేశారు. పలియాల శ్రీనివాస రావు, బూరెల నరేశ్ తదితరులు వార్డుల్లో ఇంటింట ప్రచారం చేశారు. **ప్రజాశక్తి-గూడూరు** : గూడూరు మండలంలోని తరకటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొని పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో రోడ్డుకు శంకుస్థాపన చేశారు. గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి, జనసేన పార్టీ అధ్యక్షులు దాసరి ఉమా సాయిరాం, పంచకర్ల సురేష్, అన్నం హరి, కాట్రగడ్డ రత్నబాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)** : కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించడం "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం స్థానిక 6వ డివిజన్ బ్రహ్మపురంలో అధికారులతో కలిసి పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని, కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, జెడ్పిసిఈఓ ఆనంద్ కుమార్, స్థానిక సచివాలయ సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : పెనమలూరులో నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ్యులు బోడే ప్రసాద్, తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్‌రావు, మండల అధ్యక్షులు కోయ ఆనంద్ ప్రసాద్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మారుపూడి ధన కోటేశ్వరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంచి ప్రభుత్వం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పంచాయతీ వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, గ్రామ సర్పంచ్ గ గో రుమచ్చు ఉమా, ఎంపీడీవో ఎం మరియాదేవి, మాజీ జెడ్పిటిసి కొల్లూరి వెంకటేశ్వరావు, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ** : మొవ్వ మండలం, మొవ్వ, కోసూరు, కూచిపూడి గ్రామాలలో గడప గడపకూ తిరిగి ఈ 100 రోజుల్లో సాధించిన ప్రగతిని నాయకులు వివరించారు. దేవినేని రమేష్,మొవ్వ గ్రామ టిడిపి అధ్యక్షుడు ఈడే నాగేశ్వరరావు, కార్యదర్శి పొట్లూరి బ్రహ్మేశ్వర రావు, సీనియర్ నాయకులు తాతినేని పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-గన్నవరం** : కూటమి ప్రభుత్వం తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి నాయకులు బేతాళ మాణిక్యాలరావు కొండేటి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం బండారుగూడెంలో కూటమి ప్రభుత్వం 100, రోజులు పాలన, సందర్భంగా ఇంటి కిటికీ వెళ్లి ప్రభుత్వ విధానాలు గురించి వివరించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి** : మండలంలోని మోపర్రు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉజ్జినేని అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఇటీవల వచ్చిన వరదలకు సర్వసం కోల్పోయిన బాధితులకు నిత్యవసరాలు కలిగిన బ్యాగులను ఎంఎల్ఎ అందించారు. జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, నాయకులు ఉజ్జినేని చంద్రశేఖర్(బుజ్జి) పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల అభివృద్ధి కార్యక్రమాల బ్రోచర్, స్టిక్కర్లను ఎంపీడీవో డి కృష్ణవేణి శుక్రవారం గ్రామాల్లో పంపిణీ చేశారు. ఇది మన ప్రభుత్వం అనే బ్రోచర్లను రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో వంద రోజుల లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గుడ్లవల్లేరు సచివాలయం 1 2, అంగలూరు గ్రామాల్లో నిర్వహిం చారు. గ్రామ కార్యదర్శి ఏజేయల్ నరసింహారావు, ఎలిషా రావు, పాల్గొన్నారు. **ప్రజాశక్తి- మొవ్వ** : మొవ్వ మండలం పెదముత్తేవి గ్రామంలో గడప గడపకూ తిరిగి 100 రోజుల్లో సాధించిన ప్రగతిని టిడిపి నాయకులు వివరించారు. మొవ్వ మండల టిడిపి అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావు, స్పెషల్ ఆఫీసర్ విజయవర్ధన్, గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి నాగ లక్ష్మి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

అక్కినేని శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : తెలుగు భాష అభివృద్ధి కోసం సినీ నటులు కీర్తిశేషులు అక్కినేని నాగేశ్వరరావు చేసిన కృషి మరువలేనిదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కొనియాడారు. శుక్రవారం గాంధీ క్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ అక్కినేని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి లర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకు దివిసీమ ఉప్పెన బాధితులకు ఎన్టీఆర్ అక్కినేని విరాళాలు సేకరించి అండగా నిలిచిన తీరు మరువలేనిది అన్నారు. తన పిల్లలు తెలుగు భాషకు దూరం కాకూడదని ధ్యేయంతో తెలుగు చిత్ర పరిశ్రమను మద్రాసు నుంచి హైదరాబాద్ తెచ్చేందుకు నాగేశ్వరరావుకు చేశారన్నారు. అనేక తెలుగు సాంస్కృతిక సంస్థలకు అక్కినేని అందించిన ప్రోత్సాహం మరువలేనిది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దివిసీమ లలిత కళా సమితి ప్రముఖ రాష్ట్ర స్థాయి పౌరాణిక కళాకారుడు పుప్పాల వీరాంజనేయులు, ప్రముఖ కళాకారుడు బలం రామారావు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మతి శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ తుంగల కోటేశ్వరరావు ,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యా సం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల కృష్ణా నదికి సంభవించిన వరదలలో కూటమి నాయకులు, అధికారులు సమర్థ వంతంగా పనిచేశారని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రశంసించారు. గురువారం సాయంత్రం అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో వరదల సందర్భంగా సహాయ సహకా రాలు అందించిన కూటమి నాయకులను అభినందించే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ బలహీనపడ్డ కరకట్టను కాపాడుకునేందుకు అనునిత్యం శ్రమించిన ప్రతి ఒక్కరూ అభినందనీ యులన్నారు. భవిష్యత్తులో ఎలాంటి విపత్తు వచ్చిన ఎదుర్కొనేందుకు సిద్ధమని కూటమి నాయకులు నిరూపించారన్నారు. అనంతరం వరదల సందర్భంగా విశేష కషి చేసిన కూటమి నాయకులకు బుద్ధ ప్రసాద్ మండలి వెంకట్ రామ్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు వరుచూరి సుభాష్ చంద్రబోస్, జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, టిడిపి నాగాయలంక, మోపిదేవి మండలాల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, నడకుదుటి జనార్ధన్ రావు పాల్గొన్నారు

అన్నసమారాధన

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలో జరుగుతున్న 20వ వార్షిక గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని శుక్రవారం ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కు ర్తి శ్రీనివాస్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆ గ్రామంలోని గౌడ పాలెం యువకులతో కలిసి నవరాత్రి పందిరిలో శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ యువత నిర్వహిస్తున్న అన్న సమారాధన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ సోదరుడు విక్కు ర్తి రాంబాబు, గ్రామ పెద్దలు చిన్ను గాంధీ, ఉత్సవ కమిటీ సభ్యులు చెన్ను ఓంకార్ మూర్తి, చెన్ను గోపి, దావు నాగబాబు పాల్గొన్నారు.





వరిగడ్డి పంపిణీ

ప్రజాశక్తి-ఘంటసాల : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు ఇటీవల కష్టావరదల కారణంగా వరద ప్రభావిత గ్రామం బొబ్బర్లంకలో మూగజీవాలు ఆకలితో అల్లాడుతున్న కారణంగా పశువుల ఆకలి తీర్చేందుకు శ్రీకాకుళం గ్రామానికి చెందిన తెలుగు యువత రాష్ట్ర నాయకులు తాడికొండ చిన్నా మిత్రబందం, బావిరెడ్డి సుబ్రమణ్యం కుమారులు ముందుకు వచ్చారు. మోపిదేవి మండల పరిధిలోని బొబ్బర్లంక పాడి రైతులకు రెండు ఎకరాల వరిగడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తమ్మన పవన్, జనసేన పార్టీ నాయకులు కొల్లారిచిత్, మాదాసు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో స్వచ్ఛ కార్యక్రమం

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని డోలాస్‌నగర్ నుంచి పాత జాతీయ రహదారి ప్రకాశం బ్యారేజ్ వరకు శుక్రవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. గాంధీ జయంతి రోజు అక్టోబర్ రెండో తేదీ వరకు పట్టణంలోని వివిధ వార్డుల్లో ఆరోగ్య సంరక్షణ సేవలు నిర్వహిస్తామని ఎంటిఎంసి కమిషనర్ అలీంబాష తెలిపారు. ఇటీవల వరదల వల్ల నీరు నిల్వ ఉండి తేమగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లడంతో పాటు దోమల నివారణకు మందులు పిచికారీ చేస్తామని తెలిపారు. మొక్కల పెంపకం, పార్కులను శుభ్రపరచడం వంటి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేపడతామని తెలిపారు. విద్యుత్, మంచినీరు ఆదా, ప్లాస్టిక్ నిరోధం, తాగునీరు క్లోరినేషన్ వంటి విషయాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఆరోగ్యకరమైన జీవితానికి నివాస ప్రాంతాల చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి : రాజధానిలో భాగమైన ఉండవల్లిలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ అధ్యక్షులు జంగాల వెంకటేష్ ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనుకున్న విధంగా పింఛన్లు పెంచిందన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు అన్నం పెడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ ప్రవల్లిక, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఇఒ శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కృష్ణపావని, శశికళ, సంగీత, అనిల్‌కుమార్, కూటమి నాయకులు సిహెచ్.రాజారమేష్, జి.వినయ్, ఎస్.బుచ్చిబాబు, ఎ.రమేష్, జి.బసిరెడ్డి, వి.నరేంద్ర, భార్గవ్, ఎస్.లీలాకృష్ణ, రామారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


పమిడిముక్కల మండలంలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పమిడిముక్కల : గర్భిణీలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని అంగన్వాడీ సూపర్వైజర్ ఉషా అన్నారు. మండలంలోని పెనుముచ్చ ప్రాథమిక ఉన్నంత పాఠశాలలో పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా గ్రామ సర్పంచ్ దండమూడి అచ్చమాంబ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని, ప్రతిఒక్కరూ ఆకుకూరలు పళ్ళు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధికి కూడా కట్టుబడి ఉన్నామని ఈసందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చల్లపల్లి మండలం రామానగరం అంగనవాడి కేంద్రం మూడో నెంబర్‌లో శుక్రవారం అంగన్వాడి చిన్నారుల తల్లులకు, గర్భిణీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొని పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు వహిస్తూ వైద్య ఆరోగ్యశాఖ సూచనలను తప్పకుండా పాటించాలని వివరించారు. ఆరోగ్య రక్షణకు గర్భిణీలు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలన్నారు. ఆకుకూరలతోపాటు పప్పు కూరలు చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. పోషక ఆహారంతో కూడిన వంటకాలను ప్రదర్శించి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ఎం సుజాత ఆశా కార్యకర్త రేఖ హెల్త్ అసిస్టెంట్ పావని తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

ధర్నాలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేసే ఆలోచన విరమించుకోవాలని, గతంలో ఇచ్చిన హామీ ప్రకారం 107, 108 జీవోలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను హక్కుగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్నారు. ప్రయివేటీకరణ జరిగితే ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారన్నారు. రిజర్వేషన్ల ఊసే ఉండదని తద్వారా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఉచిత వైద్య సేవలు కూడా పేద ప్రజలకు అందవని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి సి.హెచ్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మెడికల్ సీట్లు పెంచాలని అన్ని రాష్ట్రాలు డిమాండ్ చేస్తుంటే మన రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సీట్లను వసతులు కల్పించలేమనే సాకుతో వద్దని లేఖ రాయడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన సెల్ఫ్ ఫైనాన్స్ పద్ధతిపైన తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో రద్దు చేస్తామని ప్రకటించారని కానీ ఇచ్చిన హామీ పైన ఎందుకు నోరు మెదపడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర నాయకులు టి.కుమారస్వామి, మాధవ్, ప్రేమ్‌చంద్, అవినాష్, షణ్ముఖ, చిన్నారి, శశికళ, పూజిత, భువనేష్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంతో సుజన ఫౌండేషన్, షేర్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరం వరదల కారణంగా వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తుంది. ఈ నెల 29 వరకు భవానీపురంలోని ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ శిబిరంలో మహిళల కోసం గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, థైరాయిడ్, టిబి, చెవి, ముక్కు, గొంతె సంబంధిత వ్యాధులకు చికిత్సలు నిర్వహిస్తూ అవసరమైన వారికి మందులను అందజేస్తున్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు, ఇఎన్‌టి డాక్టర్ బాలకోటేశ్వరరావు, డాక్టర్ సురేష్, గైనకాలజీ నిపుణులు డాక్టర్ రత్నప్రభ ఉచిత వైద్య శిబిరంలో తమ సేవలను అందిస్తున్నారు. ఇప్పటివరకు 1,354 మందికి ఆరోగ్యపరీక్ష నిర్వహించి ఉచితంగా మందులను అందజేశామని శాసనసభ్యులు సుజనాచౌదరి తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు ప్రతి కుటుంబానికి వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని హెల్త్ క్యాంప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బొమ్మకంటి వెంకటరమణ తెలిపారు. సెప్టెంబర్ 29 వరకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని పశ్చిమ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సుజనా ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ వీరమాచనేని కిరణ్ తెలిపారు. సుజనా ఫౌండేషన్ సిబ్బంది చింతా సజన్, బాబి, మంతెన తరుణ్, వైద్య శిబిరంలో తమ సేవలను అందిస్తున్నారు.



వెస్ట్ ఎసిపిగా దుర్గారావు

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ పశ్చిమ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి)గా ఎస్ఎస్‌వికె దుర్గారావు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు వెస్ట్ ఏసిపిగా దుర్గారావు నియమితులైన విషయం తెలిసిందే. గతంలో దుర్గారావు కొత్తపేట స్టేషన్ సిఐగా పనిచేశారు. అలాగే ట్రాఫిక్‌లోను బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తదుపరి ప్రమోషన్‌పై ఇంటిలిజెన్స్‌లో కూడా ఆయన పనిచేసిన అనుభవం ఉంది. ఇప్పుడు విజయవాడ ఏసిపిగా దుర్గారావు బాధ్యతలు స్వీకరించారు.



దసరా ఉత్సవాలకు ట్రాఫిక్ నియంత్రణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: వచ్చే నెలలో జరుగనున్న దసరా నవరాత్రులు సందర్భంగా వెస్ట్ జోన్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ముందస్తు జాగ్రత్త చర్యలకు సిద్ధమయ్యారు. ఎన్టీఆర్ డిస్ట్రిక్ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు ఉత్తర్వుల మేరకు, ట్రాఫిక్ డిసిపి కృష్ణమూర్తి పర్యవేక్షణలో ఏడిసిపి ప్రసన్నకుమార్, వన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పార్కింగ్ ప్రదేశాలను, మరియు ప్రధాన కూడళ్లను పరిశీలించి తగిన సూచనలను చేశారు. ఎక్కడెక్కడ ట్రాఫిక్ సమస్యలకు అవకాశం ఉంటుందో క్షేత్ర స్థాయిలో స్వయంగా పర్యటించి సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలో వ్యూహ రచన చేస్తున్నారు. సదరు ప్రదేశాలలో తీసుకోవలసిన జాగ్రత్తలను ఏడిసిపి తమ సిబ్బందికి వివరించారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా తరలి వచ్చే అమ్మవారి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, ట్రాఫిక్ జామ్ రహిత చర్యలకు ట్రాఫిక్ పోలీసులు సిద్ధమవుతున్నారు. అందుకే వన్ ట్రాఫిక్ సెక్టార్ సిఐ ఉమామహేశ్వరరావు , సెక్టర్ టు భవానీపురం సెక్టార్ సిఐ సురేష్‌లు వారి పరిధిలో సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఏడిసిపి తగిన సూచనలు చేశారు.



ప్రభుత్వాల నిర్లక్ష్య వల్లే బుడమేరు ముంపు

ట్యాక్స్‌పేయర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-విజయవాడ: కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన బుడమేరు వరద కారణంగా నగరం విధ్వంసానికి గురైందని, దీనికి ప్రధాన కారణం ఇప్పటి వరకు పరిపాలించిన ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని ట్యాక్స్‌పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవి ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక బెల్లపుశోభనాద్రి గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఇచ్చిన నిపుణుల కమిటీ నివేదికలోని సిఫారస్సులను అమలు చేయకపోవడంతో పాటు సిటీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను ప్రభుత్వం యంత్రాంగం పట్టించుకోని కారణంగా నేడు ఈ విధ్వంసం జరిగిందన్నారు. బుడమేరు వరద నుండి విజయవాడ నగరాన్ని కాపాడాలని, నగరాన్ని సురక్షితమైన నగరంగా, నివాసయోగ్యమైన నగరంగా తీర్చి దిద్దాలని డిమాండు చేస్తున్నామన్నారు. ఈ మేరకు చర్యలు చేపట్టాలని కోరుతూ ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ముఖ్యమంత్రికి, మున్సిపల్ మంత్రికి, జలవనరుల శాఖామంత్రికి రిజిస్టర్ పోస్టు ద్వారా, ఈ మెయిల్ ద్వారా మెమోరాండాలను పంపించామన్నారు. ఇటీవల బుడమేరు వరద వల్ల ప్రజలకు వ్యక్తిగత ఆస్తినష్టం రూ.2 వేల కోట్లకు పైనే ఉంటుందని ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అంచనా వేసిందన్నారు. బుడమేరు ప్రవాహ మార్గంలోని వివిధ ప్రాంతాలలో రిజర్వాయర్లను నిర్మించాలని, బ్రహ్మయ్యలింగం చెరువు నిల్వ సామర్థ్యాన్ని పెంచి కొంత వరద నీటిని దానికి మళ్లించాలని, బుడమేరు డైవర్షన్ ఛానెల్ కెపాసిటీ 35 వేల క్యూసెక్కులకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు వేదాంతం శ్రీనివాస్, వి సుందరరామరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయులు

ఎఐఐలో ఏడేళ్ల బాలుడికి చికిత్స విజయవంతం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: హైరిస్క్ మెదుల్లో బ్లాస్టోమాతో బాధపడుతున్న ఏడేళ్ల బాలుడికి అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ (ఏవోఐ) నందు విజయవంతంగా చికిత్స నిర్వహించినట్లు ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్టు డాక్టర్ ఎస్.మణికుమార్ తెలిపారు. నగరంలోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ నందు ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. ఇంటెన్సివ్ ట్రీట్‌మెంట్ ప్లాన్‌లో భాగంగా క్రానియోస్పైనల్ రేడియేషన్ నిర్వహించినట్లు తెలిపారు. దీని ద్వారా క్యాన్సర్ కణాలను తొలగించడానికి వ్యాధి వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి మెదడు, వెన్నుముఖ రెండింటినీ లక్ష్యంగా చేసుకుని రేడియేషన్ థెరపీ అందించినట్లు తెలిపారు. చికిత్స పూర్తయిన తరువాత బాలుడు రెగ్యులర్‌గా డాక్టర్ల పర్యవేక్షణలో ఉన్నాడని తెలిపారు. సెప్టెంబరు నెలను బాల్య క్యాన్సర్ అవగాహనా మాసంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా తొలి దశలో రోగ నిర్ధారణ, అధునాతన చికిత్సా విధానాలు, పీడియాట్రిక్ ఆంకాలజీ గురించి వివరించారు. అంతేకాకుండా ఆంకాలజీలో నిరంతర పర్యవేక్షణ, తదుపరి సంరక్షణల ప్రాముఖ్యతకు ఈకేసు శక్తివంతమైన రిమైండర్‌గా కూడా నిలుస్తుందన్నారు.

మిరప తెగుళ్లకు పరిష్కారం 'గ్రాసియా'

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: గతేడాది 98 శాతం మిరప రైతులు గ్రాసియాను ఉపయోగించారని ఇది మిరప పంటలకు సమర్థవంతమైన చీడ, పీడల నివారిణి అని గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ సీఈవో రాజవేలు ఎస్.కె.అన్నారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణాసియాలో మిరప మార్కెట్‌లలో నిర్వహించిన సర్వేలో 57 శాతం మంది రైతులు గ్రాసియాను ఉపయోగించారని ప్రకటించారని తెలిపారు. మిరప పంటలో 15 నుండి 25 రోజుల దశలో గ్రాసియాను పిచికారీ చేస్తే తామర పురుగు నుండి దీర్ఘకాలిక నియంత్రణను అందిస్తుందన్నారు. గ్రాసీనా అనేది రైతులకు అత్యంత ప్రజాదరణ పొందిన గోటు బ్రాండ్ అని అన్నారు.

మిస్ టీన్ ఇండియా నేహాంజలికి అభినందన

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఆలీ క్లమ్ మిస్ అండ్ మిస్టర్ టీన్ ఇండియా 2024 పోటీలలో విజేతగా నగరానికి చెందిన దండా నేహాంజలి నిలిచింది. ఈ సందర్భంగా నగరంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ నందు విద్యార్థిని దండా నేహాంజలిని కళాశాల బృందం శుక్రవారం అభినందించింది. ఈ సందర్భంగా స్కూల్ రీజనల్ ఇన్‌ఛార్జి ఆర్.పద్మ మాట్లాడుతూ కఠోర సాధన, తపస్సుతో అసాధ్యం అనుకున్న టైటిల్‌ను సాధించిందని తెలిపారు. నగరంలోని దండా రాంబాబు, సాంబ్రాజ్యం దంపతుల కుమార్తె నేహాంజలి చిన్నతనం నుండే మోడలింగ్‌లో ఆసక్తి ఉందని ఇపుడు ఈ స్థాయికి ఎదిగిందని తెలిపారు. ఇటీవల డిల్లీ వేదికగా జరిగిన టీన్ ఇండియా పోటీలలో 167 నగరాలకు చెందిన 90 మంది పాల్గొన్నారని వీరిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన 50 మందిని ఫైనల్‌కు ఎంపిక చేయగా అందులో దండా నేహాంజలి కూడా ఉందన్నారు. ఈసందర్భంగా శ్రీ చైతన్య టెక్నో స్కూల్స్ మొగల్రాజపురం బ్రాంచి ప్రిన్సిపాల్ షబానా ఫజర్దోస్, డీన్ టి.చరణ్‌లు విద్యార్థిని అభినందించారు.



సహజ ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఆకుకూరలు, బాదం, పప్పులు, తృణధాన్యాలు వంటి సహజ ఆహారాలను తీసుకోవడం వలన మహిళలు పూర్తిస్థాయిఆరోగ్యంగా ఉంటారని ప్రముఖ పోషకాహార నిపుణులు, వెల్నెస్ కన్సల్టెంట్ పీలా కృష్ణస్వామి తెలిపారు. నగరంలోని వెల్‌నెస్ సెంటర్ నందు మహిళల్లో పీసీఓఎస్‌పై అవగాహనా కార్యక్రమంనిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణస్వామి మాట్లాడుతూ సమతుల్య, పరిశుభ్రమైన ఆహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఫుడ్స్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, గింజలు, బాదం వంటి గింజలలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఆహారాలను ఎంచుకోవడం అవసరం అన్నారు. కార్బోహైడ్రేట్స్ రిచ్‌ఫుడ్స్ వంటివి బ్లడ్ షుగర్ ప్రభావాన్ని తగ్గించడానికి ఉపయోగపడతాయని తెలిపారు. అంతకంటే ముఖ్యంగా మంచి ఆహారంతో పాటు వ్యాయామం కూడా అవసరమని తెలిపారు.

జిఆర్‌టిలో 'అన్న గారి విందు'

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నగరంలోని జిఆర్‌టి హోటల్స్‌లో అన్న గారి విందు పేరుతో ఫుడ్ బజార్‌ను ప్రారంభించినట్లు హోటల్ జనరల్ మేనేజర్ హరిప్రసాద్ తెలిపారు. ఎంజి రోడ్డులోని హోటల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రముఖ సెలబ్రిటీ చెఫ్ ధాము అధ్వర్యంలో ఈ విందు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెలబ్రిటీ చెఫ్ ద్వారా ప్రత్యక్ష వంట ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళకు చెందిన రుచికరమైన వంటకాలు ఉంటాయని చెప్పారు. శుక్ర, శనివారం రాత్రి 7.30 నుండి 10.30 గంటల వరకు ఉంటుందని అన్నారు. ఆదివారం మధ్యాహ్నం 12.30 నుండి 3 గంటల వరకు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిఆర్‌టి హోటల్స్ కార్పొరేట్ చెఫ్ సీతారాం ప్రసాద్, హెడ్ చెఫ్ శ్రీధర్ కారే పాల్గొన్నారు.

